# ఉద్వేగము

రచన:
వృ. వేం. వృ. సూర్యనారాయణమూర్తి

'కథ వ్రాయాలి! ఏం కథ వ్రాద్దాం?'

'సరే! ఈవేళ ఏదో ఒకటి వ్రాసెయ్యాలి' అని కాగితాలు ముందు పడేసుకుని కూర్చున్నాను. అంతవరకూ వాంతి చేయించే అంత జోరుగా మనసులో మసలుతూన్న భావాలు ఏమయ్యాయో. మచ్చుకైనా కనిపించకుండా పోయాయి. మెదడు పని చెయ్యడం మానేసింది.

కవులూ...కథకులూ ఆరాధించే కాఫీదేవతని సేవించాను. అబ్బే...!

ప్రస్తుత జగత్తులో ప్రత్యక్షమూర్తిత్రయమైన చుట్ట, బీడీ, సిగరెట్లలో ప్రప్రథమైనదీ నాకు ఆరాధ్యమై అనుంగు చెలికానిలా నాతో సహవాసం చేస్తున్నదీ అయిన చుట్ట ముట్టించాను. మరో అగ్గిపుల్ల అవుసరం లేకుండా అలా...చుట్టమీద చుట్ట కాలుస్తూ – రైలింజనులా పొగ వదుల్తూ – భావోద్వేగం కోసం కాసుక్కూర్చున్నాను–ఎంతకీ రాందే...

ఇంతలో మా శ్రీమతి. 'ఒకసారి ఇలా రండి!...మిమ్మల్నే'...అంటూ అరెష్టు వారంటులాంటి ఆర్డరు జారీ చేసింది. 'మధ్య ఇదేమిటా?'...అనుకుంటూ లోపలికి వెళ్లేను.

'చుట్ట కాలుస్తూ నిద్ర వచ్చి – ఏ పక్కమీదేనా పడేశారేమిటండీ? అంత పొగొస్తోంది...ఊపిరాడక ఉక్కిరి బిక్కిరై చస్తుంటేనూ?...గుడ్డ కాలిన వాసనా కాదు. మరేమన్నా అంటెట్టారేమిటండీ?' అని ఏకటాకిని ప్రశ్నల వర్షం కురిపిస్తోంది.

మెరుపులా మెరిసి మాయమైపోయిన ఒక భావజవనాశ్వాన్ని మెదడనే సాలలో బంధించాలని విశ్వప్రయత్నంలో వున్న నేను ఏం సమాధానం చెప్పగలను?

'అయ్యో, రామా! అదేమిటండీ...బెల్లం కొట్టిన రాయిలా ఉలకరు పలకరు?' అంటూ బిందీ నీళ్లూ తీసుకొని గదిలోకి వెళ్ళి ముక్కున వేలు వేసుకొని వెంటనే తిరిగి వచ్చి; 'మీకు మతిగానే పోతోందేమిటండీ...! అన్ని చుట్టలు కాల్చి పారేశారు?' అంటోంది. లీలగా విన్పిస్తోందంతే...

కాల్చి పారేసినవి ఒకటా...రెండా...! ఒక కట్ట మరి. అంటే యాభై! ఒకేసారి... భావాన్వేషణలో బుర్ర వేడెక్కి వచ్చిన గీర– ఎంత అలవాటు ఉన్నా...ఒకదాని వెంట మరొకటి వరుసగా యాభై ఘాటు చుట్టలు కాల్చిన గీరా...కలసి నిజంగా మతిలేని స్థితిలోకి తీసుకువచ్చాయి. నీరసం వికారం ప్రారంభించింది.

అందరూ కథలు వ్రాస్తున్నారు. పేరూ ప్రఖ్యాతీ సంపాదిస్తున్నారు. మనం మాత్రం ఎంత గౌరవం...! అబ్బ! పేపరులో పేరు పడితే...పదిమందీ నా కథ చదివి నన్ను అభినందిస్తుంటే! అంటూ కలలు కంటూ–అడపాదడపా ఏవేవో వ్రాసి పత్రికలకి పంపడం.అవి మనకి భద్రంగా తిరిగి వచ్చెయ్యడం, మన ఖర్చుమీద...

ఇక ముందు అలా జరగనివ్వకూడదని పద్ధతిలో పటిష్ఠంగా మాంచికథ వ్రాద్దామనే పట్టుదలతో చుట్టమీద చుట్ట – ఏకటాకిని

కాల్చి ఊపిరి తిత్తుల్ని ఊదరగొట్టేశానేమో- వెర్రివికారం...నీరసం వచ్చి బుర్ర గిర్రున తిరిగి ఒక్కసారిగా కుర్చీలో కూలబడిపోయాను. చెవుల్లో హోరుగా వుంది. అయినా లీలగా అన్నీ మాటలు విన్పడే శక్తి మాత్రం వుంది. మాట్లాడలేకపోతున్నాను.

'ఏమిటండీ! అలా మాట్లాడకుండా నిలబడి నిలబడి తూలి పడ్డారూ...? ఇంకా నయం క్రింద పడితే...అమ్మో!' అంటూ కదిపింది వచ్చి మా శ్రీమతి.

గాభరా పడవద్దని చెయ్యి ఊపేను. కాని గమనిస్తేనా? కళ్ళు తెరుద్దామంటే రెప్పలు కలిపి కుట్టేసినట్లు కదలవు. ఏం చెయ్యను?

'ఏం చెయ్యను, భగవంతుడా?' అంటూ గద్గదస్వరంతో కాళ్లూ చేతులూ విరగ ద్రొక్కుకుంటూ-'వారా...వీరా...'అంటూ ఎవర్నేనా పిలవడానికి పరుగెత్తింది.

మా ఆవిడ మాటలు ఘాటుగా వున్నా మనసేమో మంచిదే. కాస్త నాకేదేనా చీమ కుట్టిందంటే వెయ్యి దేవుళ్ళకు మొక్కి- ఎంతో ఉపచారం చేస్తుంది తగ్గేవరకూ. అనేకసార్లు 'పొడుచుట్ట వదిలెయ్యగూడదు టండీ?' అని పోట్లాడేది కూడా. నాకూ మానెయ్యాలనే...కాని ఎలా? కట్టుకున్న ఇల్లాల్ని కోపం వచ్చి పుట్టింటికి కొన్నాళ్ళు పంపించెయ్యవచ్చుగాని - ఎన్నిసార్లు కసిరి కొట్టి- ఒట్లుపెట్టినా మారాం చేస్తూ మరింత నెత్తికెక్కుతోంది. అందుకే తప్పో...ఒప్పో... ఒకప్పుడు ఒక పద్యం కూడా చెప్పేను.

చుట్టఁ గనిపెట్టినట్టి వాడెట్టివాడో ?
ఎట్టియెడ నిప్పుముట్టించి యిచ్చినాడో ?
పట్టి విడువదు, ముద్దుకై ముట్టుకొన్నఁ
నొట్టుబెట్టఁగ గట్టున నట్టెబెట్టు! అని.

చాలా కాలంగా...ఇంచుమించు చిన్ననాటినుండీ సావాసం చేస్తోంది మరి...

ఇంతలో మా ఆవిడ పిలుపులకి నలుగురూ వచ్చిచేరారు...అందులో ఒక వైద్య మహాశయుడు కూడా వేంచేశాడు. వచ్చీరాగానే చెయ్యి పట్టుకుని చూసి చూసి...

"చాలా దిగజారుగా ఉందమ్మా! నాడి కూడా సరిగ్గా దొరకడం లేదు. చింతామణి లాంటి దివ్యౌషధాలు వాడాలి" అంటున్నాడు, ఆ అపరధన్వంతరి.

నాకు నిజంగా లాగి వెంపకాయ కొడ్దామని అనిపించి చెయ్యి గుంజుతున్నాను.

"చూశారా! చూశారా! మిడసరం కూడా మొదలయ్యింది. ఇంక లాభం లేదు చూస్తే" అని తన సంపాదనకి పాచికలు వేస్తున్నాడు. తెలిసీ తెలియని ఆ కేటలాగు వైద్య శేఖరుడు!

మా ఆవిడ వాడన్నదంతా చదివించి మందిప్పించేదే...కాని, కాసీకూడా పైన లేదెక్కడా...ఇల్లంతా చూచి వచ్చిందనుకుంటాను "బాబ్బాబు మీ ఋణం వుంచుకోము. కాస్త నిమ్మళించాక అంతా ఇచ్చుకుంటాను" అంటోంది...

"అలాగయితే ఎలాగమ్మా! బోలెడు మందులుకొనాలి. పరిస్థితి కూడా బాగు

(తరువాయి 26వ పేజీలో)

చేసి, గోమూత్రము చల్లుతారు. ఈరకంగ చేయుటలో ఒక రహస్యముంది. గోమలానికి, గోమూత్రానికి క్రిముల జంపే గుణముంది. ఆ రహస్యము మనపూర్వులెరిగియె పై వాడుక నలవాటుయందుంచారు. పండుగనాడు మామిడియాకులు కట్టుటలోకూడ కారణముంది. పండుగనాడు ప్రతి యింటికి పదుగురువచ్చి కూడుట యౌంటుంది. అప్పుడు పదిమంది వదులు బొగ్గుపులుసువాయువుతో నక్కడనుండు గాలి కలుషితమవుతూంది. మామిడి యాకులకు త్వరితముగా నీ బొగ్గుపులుసువాయువును హరించే గుణముంది. అదియుగాక మంచి సువాసన గాలి కూడ యిస్తూంది. పచ్చని తోరణము యింటికి ప్రత్యేకపు టందాన్నిస్తుంది. అందువలనే మామిడియాకుల తోరణము పండుగనాడు, వేడుకలప్పుడు కట్టుతుంటాము.

భోగి, సంక్రాంతులవోలె కనుమకూడ యొకసంతోషదాయకమైన రోజుయే. ఆనాడు కోడిపందెములు పారువేట మొదలయినవి జరుపుతారు. ఇది పశువులకు ప్రత్యేక పండుగ. కాని జీవజంతువులు విరివిగా జంపబడుతవి. అది వాని కర్మ. ఆరోజు కోడిపందెములాడువారు మత్తెక్కినట్లు వింత వింతైన పాటలు పాడుతూ, కూనిరాగాలు తీస్తూ కోడిపందెము లాడుతారు. ఆనాడు వారి పాటలు ప్రత్యేకాకర్షణంగానుంటాయి. పశువులలంకరణ, మొదలయినవి కనులపండువుగా యుంటవి. పారువేటనాడు అక్కడ జనము చాలమంది మూగుతారు. వారు ధరించిన వస్త్రాలువగైరా చూస్తూయున్న కడుపునిండినట్లుంటుంది.

నిజంగ నీ మూడు పండుగలు ముక్కంటి మూడు కన్నులు అని చెప్పాలి. ఇవి పండుగరాజములు. ఈనాడు ప్రజలనుభవించిన సంతోషము మరేదినము ననుభవించరు.

---

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులుకాదు.

—సంపాదకుడు.

(6వ పేజీ తరువాయి)

లేదు." అంటున్నాడు మరికాస్త పిరికి మందు పోస్తూ...

"ఏం చెయ్యను బాబూ! ఇంట్లో పైన చిల్లి గవ్వకూడా లేదు. అంతా ఆయనదగ్గరే వుంది. ఎవర్నైనా అడుగుదామంటే నెలాఖరు రోజులు ఉంటుందో ఉండదో...? ఈ గొలుసు ఇస్తాను. అమ్మిమందు తీసుకురా బాబూ!" అంటోంది.

అంతలో...

"ఏమైందమ్మా", అంటూ ఎరిగున్న మిత్రుడొకడు. ఇంతమంది యిక్కడ మూగేరేమా! అనుకుంటూ వచ్చాడు.

మా శ్రీమతి సంగతంతా వివరించింది.

అంతా తెల్సుకుని – ఆ మిత్రుడు –

"భలే వైద్యుడవయ్యా! మా వాణ్ణి కాస్సేపుంటే – నీ మాత్రతో వైకుంఠ యాత్ర చేయించేద్దువు బలవంతాన్ని" చూడమ్మా మరేంగాభరాపడక – కాసిన్ని మంచినీళ్లు తీసుకురండిలాగ అన్నాడు.

"రక్షించాడురా!" అనుకున్నాను. అప్పటికి కొంతగీర వదిలింది కూడా...

లేచాక "మంచి భలేవారండీ! హడిలిచచ్చానూ ఈమాటు పాడు చుట్టపేరెత్తేరంటే..." అంది.

"అలాగే" అన్నాను.

ఎప్పుడేనా కథలు వ్రాయాలనిపిస్తే – ఈ సంఘటన గుర్తుకొచ్చి కాస్సేపు నవ్వుకుంటుంటాం...

Edited and Published by A. N. Raghavachar, No, 32, Krishnappa Naick Tank St., Madras-1
Printed by V, Kuppuswamy Chetty, Bharathamatha Press, No, 39, Anderson St., Madras-1